హాస్టల్.. కష్టాల్..!

ప్రభుత్వ హాస్టళ్లలో కనీస మౌలిక వసతులు కల్పించకపోవడంతో విద్యార్థులు పుస్తకాలతోపాటు సమస్యలతో కుస్తీ పడుతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి ఆరు నెలలవుతున్నా హాస్టళ్లలో నెలకొన్న సమస్యలపై దృష్టిసారించకపోవడంతో పేద విద్యార్థులు నిత్యం అవస్థలు పడాల్సి వస్తోంది. ఆరు నెలలుగా కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం విడుదల చేయలేదు. చలి కాలం ప్రారంభమైనా నేటికీ దుప్పట్లు పంపిణీ చేయలేదు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నా పాత టెండర్లతోనే మెనూ అమలు చేయాలని చెప్పడంపై కాంట్రాక్టర్లు కస్సుబుస్సులాడుతున్నారు. పలు హాస్టళ్లలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. శిథిలమైన రేకుల షెడ్లు, అద్దె భవనాల్లో బిక్కుబిక్కుమంటూ చదువుకుంటున్న విద్యార్థుల కష్టాలపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్..

- మార్కాపురం, గిద్దలూరు నియోజక వర్గాల్లోని హాస్టళ్లలో విద్యార్థులకు వెంటాడుతున్న సమస్యలు
- తాగునీటి కోసం రోజూ అవస్థలు పడుతున్న బాలబాలికలు
- మరుగుదొడ్ల సమస్యపై ప్రభుత్వం దృష్టి సారించాలని చిన్నారుల విజ్ఞప్తి
- పలు హాస్టళ్లలో వంట మనుషులుగా వాచ్‌మెన్, అటెండర్లు
- చలి కాలం ప్రారంభమైనా బీసీ, ఎస్సీ హాస్టళ్ల విద్యార్థులకు నేటికీ అందని దుప్పట్లు
- హాస్టల్ నిర్వహణ వ్యయం, కాస్మోటిక్స్ చార్జీల విడుదల కోసం ఆరు నెలలుగా ఎదురుచూపులు
- ధరలు పెరిగినా పాత టెండర్లతోనే అమలు చేయడంపై వార్డెన్ల మల్లగుల్లాలు



గొట్లగట్టు బీసీ హాస్టల్లో ఆరుబయటే స్నానం

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

సాక్షి నెట్‌వర్క్: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో పేదింటి పిల్లలు నరకం అనుభవిస్తున్నారు. ఫీజుల భారం మోయలేని పేద, మధ్య తరగతి కుటుంబాల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ హాస్టళ్లలో చేర్పిస్తే.. వారి సంక్షేమాన్ని సర్కారు గాలికొదిలేసింది. హాస్టల్ విద్యార్థులు ఎదుర్కొంటున్న కష్టాలపై రాష్ట్ర హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ ఇటీవల పలు మార్గదర్శకాలను సూచించడం క్షేత్ర స్థాయిలో పరిస్థితులను తేటతెల్లం చేసింది.

గిద్దలూరు నియోజకవర్గంలో హాస్టళ్లను పరిశీలిస్తే.. బేస్తవారిపేటలోని బీసీ హాస్టల్లో వంట మాస్టర్ లేకపోవడంతో వాచ్‌మెన్, అటెండర్ వంట చేస్తున్నారు. సాయంత్రం, రాత్రికి ఇచ్చే స్నాక్స్ ఇవ్వడంలేదు. వార్డెన్ చుట్టపుచూపుగా హాస్టల్‌కు వస్తున్నారు. ఇక్కడ 80 మంది విద్యార్థులకు నాలుగే మరుగుదొడ్లు ఉన్నాయి. దుప్పట్లు లేకపోవడంతో రేకులషెడ్డులో విద్యార్థులు చలికి ఇబ్బంది పడుతున్నారు. హాస్టల్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో దుర్వాసన వస్తోంది. బేస్తవారిపేట ఎస్సీ హాస్టల్లో బాత్‌రూమ్‌లు అసంపూర్తిగా నిలిచిపోవడంతో ఆరుబయట స్నానాలు చేస్తున్నారు. కంభం బాలుర హాస్టల్లో మరుగుదొడ్లకు తలుపులు లేవు. భవనాలు శిథిలావస్థకు చేరాయి. కొమరోలులోని నాలుగు ప్రభుత్వ హాస్టల్స్ అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. అల్లినగరంలోని బీసీ హాస్టల్ శిథిలావస్థకు చేరిన మట్టి మిద్దెలో నిర్వహిస్తున్నారు. రాచర్ల మండలంలోని యడవల్లి, అనుమలవీడు హాస్టళ్లలో మరుగుదొడ్లకు తలుపులు సక్రమంగా లేవు. అనుమలవీడులోని రెండు హాస్టళ్లు శిథిలావస్థకు చేరాయి. గిద్దలూరులోని ఎస్సీ వసతి గృహాలు శిథిలావస్థకు చేరడంతో వసతుల లేమితో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అర్ధవీడులో మూడు ప్రభుత్వ హాస్టళ్లు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. మినరల్ వాటర్, సరైన మరుగుదొడ్లు, కనీస వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

మార్కాపురం నియోజకవర్గంలోని హాస్టళ్లనూ సమస్యలు చుట్టుముట్టాయి. మార్కాపురం పట్టణంలోని చెన్నకేశవ నగర్‌లో ఎస్సీ బాయ్స్ హాస్టల్లో విద్యార్థులు చాలీచాలని సౌకర్యాలతో అవస్థలు పడుతున్నారు. 66 మంది విద్యార్థులకు మూడు మరుగుదొడ్లే ఉండటంతో తంటాలు పడుతున్నారు. బిందెలు, బబుల్స్‌తో మినరల్ వాటర్ తెచ్చుకుని తాగుతున్నారు. రాయవరం గురుకుల పాఠశాలలో 650 మంది విద్యార్థులను తాగునీటి కష్టాలు వేధిస్తున్నాయి. ఆర్ఓ ప్లాంటు మరమ్మతులకు గురైంది. మధ్యాహ్న భోజన సమయంలో మినీ ట్యాంక్ నీటిని తాగుతున్నారు. గజ్జలకొండ హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరడంతో బిక్కు బిక్కుమంటూ చదువుకుంటున్నారు. తల్లిదండ్రులు పాకెట్ మనీ కింద ఇచ్చిన డబ్బును కాస్మోటిక్స్‌కు వాడుకుంటున్నారు. తర్లుపాడులోని బీసీ హాస్టల్‌ను వసతులు లేని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఎస్సీ హాస్టల్లో మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. కలుజువ్వలపాడులోని కేజీబీవీలో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేవు. నాడు నేడు-2లో భాగంగా నిర్మించతలపెట్టిన నూతన భవనానికి కూటమి ప్రభుత్వం నిధుల నిలిపివేసింది. కొనకనమిట్ల, పెదారికట్లలోని ఎస్సీ హాస్టళ్లలో విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, నీటి వసతి లేక ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థులు ఉదయాన్నే వాటర్ బాటిళ్లు తీసుకుని బహిర్భూమికి వెళ్తున్నారు. ఇరుకు గదుల్లో సర్దుకుపోతూ, ఆరుబయటే స్నానాలు చేస్తున్నారు. గొట్లగట్టు బీసీ హాస్టల్ లోనూ పరిస్థితి ఇలానే ఉంది. పాదిలిలోని ఎస్సీ బాలికల హాస్టల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. మినరల్ వాటర్ బబుల్స్, ట్యాంకర్ నీటిని వార్డెన్ కొనుగోలు చేస్తున్నారు. బాలికలు చదువుకునే చోట తగినంత లైటింగ్ లేదు. ఎస్సీ బాలుర హాస్టల్లో మరుగుదొడ్లు, స్నానపు గదులు శిథిలావస్థకు చేరాయి. నీటి సమస్య కూడా తీవ్రంగా ఉంది. బీసీ బాలికల హాస్టల్లో తాగునీటిని వార్డెన్ సొంత నిధులతో కొనుగోలు చేస్తున్నారు. బీసీ బాలుర హాస్టల్‌లో ట్యూటర్ లేరు. భవనం శ్లాబ్ పెచ్చులూడుతోంది. కుక్, కామాటి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరుగుదొడ్లు లేవు. తూర్పు వైపు ప్రహరీ లేదు.



మార్కాపురం ఎస్సీ బాయ్స్ హాస్టల్‌లో సుమారు ఇరవై మందికి ఒక అచాచ్‌బాత్‌రూం



గొట్లగట్టులో ఉదయాన్నే బహిర్భూమికి వెళ్లవస్తున్న విద్యార్థులు



రాయవరం గురుకుల పాఠశాలలో నీటి కోసం బాలికల అవస్థలు



కంభం ====



బేస్తవారిపేట ఎస్సీ హాస్టల్లో అసంపూర్తిగా నిలిచిన మరుగుదొడ్లు



పాదిలి ఎస్సీ బాలుర హాస్టల్లో నిరుపయోగంగా మరుగుదొడ్లు



తర్లుపాడులో ఎస్సీ హాస్టల్లో శిథిలావస్థలో టాయిలెట్లు



పాదిలి ఎస్సీ బాలికల హాస్టల్లో అరకొర వెలుగులోనే చదువు

క్లుప్తంగా

మట్టి మాఫియాను అడ్డుకోండి

మార్కాపురం: మార్కాపురం ప్రాంతంలో చెరువుల్లో ఉన్న మట్టిని కొందరు నాయకులు రాత్రిపూట తరలిస్తున్నారని, మట్టి మాఫియాను అడ్డుకోవాలని రైతు సంఘం జిల్లా నాయకులు గాలి వెంకటరామిరెడ్డి కోరారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కాలంలో మార్కాపురం సమీప చెరువుల్లో కొంతమంది సిండికేట్ అయ్యి జేసీబీలతో చెరువుల్లో మట్టి తవ్వి ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించి లక్షలాది రూపాయలు సంపాదిస్తున్నారని, వారిని కట్టడి చేయాలని కోరారు. అనంతరం సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

విద్యార్థిని చదువుకు ఆర్థిక సహాయం



సౌమ్యకు నగదు అందిస్తున్న దాతలు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీకి చెందిన విద్యార్థిని టి. సౌమ్య చదువుకు ఎంఈఎఫ్ సభ్యులు సోమవారం రూ.10 వేలు సాయం అందించారు. పద్మావతి యూనివర్శిటీలో లా కోర్సులో సీటు సాధించిన తన కుమార్తెకు చేయూతనిచ్చిన ఎంఈఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జీవరత్నం, అధ్యక్షుడు ఏలియా, సెక్రటరీ సంజీవ్, కోశాధికారి ప్రసాద్, కుమార్, ఫిలిప్, బర్నబాస్, చార్లెస్, కాశీరావు మాదిగ తదితరులకు తండ్రి చిట్టిబాబు కృతజ్ఞతలు తెలిపారు.

కబడ్డీలో గొట్లగట్టు విద్యార్థి సత్తా



ఆకాష్‌ను అభినందిస్తున్న పీడీ బాలగురవయ్య

కొనకనమిట్ల: ఇటీవల పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలో నిర్వహించిన అండర్-19 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో గొట్లగట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి కోలా ఆకాష్ సత్తా చాటాడు. జిల్లా జట్టు విజయానికి కృషి చేసిన ఆకాష్‌ను పీడీ వై.బాలగురవయ్య, హెచ్ఎం విజయలక్ష్మి సోమవారం ప్రత్యేకంగా అభినందించారు.

970 కిలోల రేషన్ బియ్యం పట్టివేత



సీజ్ చేసిన బియ్యంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ స్వాతి

కొమరోలు: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సీజ్ చేసిన సంఘటన మండలంలోని పోసుపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. ఓ ఇంట్లో నిల్వ ఉంచిన 970 కిలోల రేషన్ బియ్యాన్ని గిద్దలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వై.స్వాతి సీజ్ చేసి, గిద్దలూరులోని గోడౌన్‌కు తరలించారు.

పశుగణన సర్వేకు సహకరించాలి



పశువైద్యాధికారులతో మాట్లాడుతున్న డీడీ

గిద్దలూరు రూరల్: స్థానిక పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుల కార్యాలయాన్ని సోమవారం ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రాఘవయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పశుగణన సర్వే తీరుపై సిబ్బందిని ఆరా తీశారు. గిద్దలూరు, రాచర్ల మండలాలల్లో 31027 ఇళ్లను 19 మంది ఎన్యుమరేటర్లు సర్వే చేస్తున్నారని అధికారులు తెలిపారు. పశుపోషకులకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని డీడీ సూచించారు. సహాయ సంచాలకులు యోగానందప్రసాద్, డాక్టర్ చక్రవర్తి, సిబ్బంది ముజాహర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

తర్లుపాడు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ముగ్గులు, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించినట్లు గ్రంథపాలకుడు సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 80 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఉపాధ్యాయులు కోటి మోహన్, గోను శ్రీనివాసులు, గురవారెడ్డి, పుల్లయ్య తదితరులు పర్యవేక్షించారు. మంగళవారం క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్లు లైబ్రేరియన్ తెలిపారు.

చిరు వ్యాపారుల పొట్ట కొట్టొద్దు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో ఆక్రమణల పేరుతో చిరువ్యాపారుల బంకులను తొలగించడంతో 1000 మంది జీవనోపాధి కోల్పోయి రోడ్డునపడ్డారని, వారికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని రైతు సంఘం నాయకులు గాలి వెంకటరామిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో చిరు వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో అయన మాట్లాడారు. బడా బాబులను వదిలేసి చిరువ్యాపారులపై అధికారులు ప్రతాపం చూపారని ఆరోపించారు. డ్రైనేజీలపై బంకులు కొనసాగించుకునేందుకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందించారు.



నిరసన తెలుపుతున్న చిరువ్యాపారులు

ఇళ్ల స్థలాల కోసం వినతి

మార్కాపురం పట్టణంలో అర్హులైన పేదలకు రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల స్థలం ఇవ్వాలని కోరుతూ ఏఐటీయూసీ కార్యదర్శి షేక్ ఖాశీం, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య ఆధ్వర్యంలో సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మీ కోసం కార్యక్రమంలో అర్జీ ఇచ్చారు. మార్కాపురం డివిజన్ పరిధిలో ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, ఎన్ఎస్‌పీ శాఖల్లో పనిచేస్తున్న వర్క్‌చార్జి సిబ్బందికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఎంప్లాయీస్ డివిజన్ ప్రెసిడెంట్ ఆలేటి నాగయ్య, వెంకట సుబ్బయ్య సబ్‌కలెక్టర్‌కు అర్జీ అందించారు.

కరాటేలో మార్కాపురం విద్యార్థుల ప్రతిభ

మార్కాపురం: విజయవాడలో ఈనెల 17న జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో మార్కాపురం పట్టణానికి చెందిన ఎమ్ఎస్ స్పోర్ట్స్ కరాటే విద్యార్థులు పది స్వర్ణాలు, 4 రజతాలు, 2 కాంస్య పతకాలు సాధించినట్లు ఇన్‌స్ట్రక్టర్లు ఎం.శ్రీనివాసరెడ్డి, తోట ప్రసాద్ తెలిపారు. విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చూపారని పేర్కొన్నారు. వీరిని కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కియో మిల్టన్, కొండూరి కీర్తన్, నల్లూరి మోహన్‌రావు అభినందించారు.



గోల్డ్ మెడల్స్‌తో విద్యార్థులు, నిర్వాహకులు

కబడ్డీలో విద్యార్థుల సత్తా

ఇటీవల నేతాజీ సుభాష్ చంద్రబోస్ కబడ్డీ క్లబ్ నిర్వహించిన టోర్నమెంట్‌లో మార్కాపురం వాసవీ నికేతన్ విద్యార్థులు ద్వితీయస్థానంలో నిలిచారని డైరెక్టర్ కె రంగయ్య, ఏఓ రంజిత్ కుమార్ తెలిపారు.

రెండు టిప్పర్లు ఢీ.. ముగ్గురికి గాయాలు



ప్రమాదానికి గురైన టిప్పర్లు

పొదిలి రూరల్: ఆగి ఉన్న టిప్పర్‌ను వెనుక నుంచి మరో టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన పొదిలి మండలం అగ్రహారం వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పొదిలి వైపు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న టిప్పర్‌ను ఉదయం పొగమంచు కారణంగా రోడ్డు పక్కన ఆపారు. అదే సమయంలో దోర్నాల నుంచి చీమకుర్తి వైపు వెళ్తున్న మరో టిప్పర్.. ఆగి ఉన్న టిప్పర్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. టిప్పర్ డ్రైవర్ కర్ణకుమార్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి తీవ్రగాయాలయ్యాయి. పక్కనే ఉన్న బడేమియా, ఇస్మాయిల్‌కు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

టిప్పర్ డ్రైవర్‌ను బయటకు తీసేందుకు స్థానికులు తీవ్రంగా శ్రమించారు. క్షతగాత్రులను 108 వాహనంలో పొదిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా సత్యసాయి జన్మదిన వేడుకలు

గిద్దలూరు రూరల్: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా 99వ జన్మది వేడుకలను పట్టణంలోని రేడియో బావి సమీపంలో సత్యసాయిసేవా మందిరంలో భక్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, వేదపఠనం, నామసంకీర్తన కార్యక్రమాలతో పాటు సామూహిక వ్రతాలు నిర్వహించారు.

ఆటో మొబైల్ దుకాణంలో చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

పొదిలి: స్థానిక కర్నూలు రోడ్డులో ఎంపీడీఓ కార్యాలయం సమీపంలోని ఆటోమొబైల్ దుకాణంలో ఆదివారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. రాజేష్, రసూల్ అనే వ్యక్తులు ఆటోమొబైల్ దుకాణం నిర్వహిస్తున్నారు. సోమవారం దుకాణం తెరిచేందుకు రాగా షట్టర్ తాళాలు పగలగొట్టి ఉన్నాయి. క్యాష్ కౌంటర్‌లో ఉంచిన రూ.50 వేల నగదు చోరీ అయినట్లు గుర్తించారు. దొంగలు సీసీ కెమెరాలను కూడా ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పొదిలి పోలీసులు తెలిపారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు.

విద్యతోనే భవిత బంగారుమయం

బంగారు బాల్యం వారోత్సవాల్లో భాగంగా మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు చదువు ప్రాధాన్యతను వివరించడంతోపాటు హక్కులపై అవగాహన కల్పించారు.



బేస్తవారిపేట : పోటీ పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు



పిల్లలకు పుస్తకాలు అందచేస్తున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం రూరల్: మండలంలోని నాయుడుపల్లిలో బంగారు బాల్యం కార్యక్రమానికి సబ్‌కలెక్టర్ వెంకట త్రివినాగ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ చిరంజీవి, వెలుగు ఏపీఎం పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం టౌన్: పట్టణంలోని ఎస్సీబీసీ కాలనీలో కార్యక్రమాలకు కమిషనర్ నారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాలల ఆరోగ్యం, విద్యాభ్యాసంపై జాగ్రత్తలు తెలియజేశారు. సచివాలయ ఉద్యోగులు, హెచ్ఎం రవి కుమార్, నాసర్‌వలి, నోడల్ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: బాలికా విద్యతో సమాజాభివృద్ధి సాధ్యమని ఎంపీడీఓ ఈశ్వరమ్మ, తహసీల్దార్ ఆవుల సురేష్, ప్రత్యేకాధికారి అర్చన పేర్కొన్నారు. సోమవారం కొనకనమిట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో బంగారు బాల్యం కార్యక్రమం నిర్వహించి తల్లిదండ్రులకు, విద్యార్థులకు బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ఎంఈఓ డాంగే షరీఫ్, ఈఓఆర్డీ శ్రీదేవి, పాఠశాల హెచ్ఎం సుజాత ఉన్నారు.

పొదిలి: బంగారు బాల్యం వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో స్థానిక ఆల్ఫా ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. నినాదాలు విభాగంలో ఆల్ఫా గ్రేస్, లోగో క్రియేషన్‌లో నిషాంత్, డిబేట్‌లో షబ్నమ్ విజేతలుగా నిలిచారు. వీరిని ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి, సీనియర్ ఉపాధ్యాయులు బీవీ.రెడ్డి, హెచ్ఎం ఏడుకొండలు, ఏఓ నజీర్, కిరణ్మయి అభినందించారు.

గిద్దలూరు రూరల్: బాల్యం నుంచి కష్టపడి చదివితే భవిత బంగారుమయం అవుతుందని తహశీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి పేర్కొన్నారు. గిద్దలూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ డి.వెంకటదాసు, ఇన్‌చార్జి ఎంపీడీఓ చెన్నారావు, సీడీపీఓ జ్యోతి, హెచ్ఎం నాగభూషణ్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంభం: మండలంలోని హజరత్‌గూడెంలో సోమవారం సర్పంచ్ మహబూబ్ పీరా అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంఈఓ మాల్యాద్రి మాట్లాడుతూ దేశ భవితకు బాలల పురోగతే ప్రధానమన్నారు. పంచాయతీ కార్యదర్శి ఉమామహేశ్వరి, సీఆర్పీలు పాల్గొన్నారు.

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జితేంద్రకుమార్, ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు, ఎంఈఓ సీహెచ్ రమణారెడ్డి, హెచ్ఎం ఎంఎస్ శర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ నారాయణరావు



గిద్దలూరులో మాట్లాడుతున్న తహసీల్దార్

కొమరోలు: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ ధనలక్ష్మి మాట్లాడుతూ.. బాల్య వివాహాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం బాల్య వివాహాలపై అంగన్‌వాడీ కార్యకర్తల నేతృత్వంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ మస్తాన్‌వలి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంతకుమారి, ఎంఈఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు నాసర్‌వలి గంధ మహోత్సవం

- మాదాలవారిపలెంలో తిరునాళ్లకు ఏర్పాట్లు సిద్ధం
- గ్రామస్తుల ఆధ్వర్యంలో మూడు విద్యుత్ ప్రభల ఏర్పాటు

పొదిలి రూరల్/పొదిలి: హిందూ, ముస్లింలు సమైక్యంగా నిర్వహించే నాసర్‌వలి గంధ మహోత్సవానికి పొదిలి మండలంలోని మాదాలవారిపాలెం దర్గా ముస్తాబైంది. 150 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ దర్గాలో ఏటా నిర్వహించే తిరునాళ్లకు రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. మంగళవారం గంధ మహోత్సవం సందర్భంగా దర్గాను రంగులు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. రాత్రికి గ్రామస్తుల ఆధ్వర్యంలో మూడు విద్యుత్ ప్రభలపై సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశస్తున్నారు. తిరునాళ్ల సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లను సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై వేమన సోమవారం పరిశీలించారు. తిరునాళ్లను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని గ్రామస్తులకు సూచించారు.



దర్గా వద్ద ఏర్పాట్లపై చర్చిస్తున్న సీఐ, ఎస్సై